క్లుప్తంగా

జడ్చర్ల, తిమ్మాజిపేటలో కేటీఆర్ పర్యటన



జడ్చర్ల/తిమ్మాజీపేట: జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి డాక్టర్ శ్వేతారెడ్డి సేవలు చిరస్మరణీయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. మంగళవారం శ్వేత ప్రథమ వర్ధంతి సందర్భంగా తిమ్మాజిపేట మండలం ఆవంచలో ఏర్పాటు చేసిన శ్వేత విగ్రహాన్ని కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు హాజరై ఆవిష్కరించారు. అనంతరం జడ్చర్లలోని ఓ ఫంక్షన్‌హాల్ నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో శ్వేత చిత్రపటం పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అంతకుముందు మాజీ మంత్రి లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సతీమణి శ్వేత చిత్రపటం వద్ద నివాళులర్పించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు వెంకటేశ్వర్‌రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, అంజయ్యయాదవ్, రామ్మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జడ్చర్ల టౌన్: మండలంలోని పోలేపల్లి ఫార్మసెజ్‌లోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని జడ్చర్ల ఇండస్ట్రియల్ ఏరియా, కొండేడ్, గంగాపురం, ఈద్గాన్‌పల్లి, మిషన్ భగీరథ ఫీడర్లకు బుధవారం విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని ఏడీఈ చంద్రశేఖర్ తెలియజేశారు. 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పీజీ ప్రవేశపరీక్షలో ప్రతిభ



జడ్చర్ల టౌన్: ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వహించిన పీజీ ప్రవేశ పరీక్షలో బీఆర్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థిని శైలజకు వృక్షశాస్త్రంలో రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు లభించింది. నలుగురు విద్యార్థులు వృక్షశాస్త్రంలో పీజీ ప్రవేశ పరీక్ష రాయగా శైలజకు 4వ ర్యాంకు, గీతాంజలి 23వ ర్యాంకు, వనజ 227వ ర్యాంకు, అరుణ 361వ ర్యాంకు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సుకన్య, వృక్షశాస్త్ర విభాగం అధ్యాపకుడు సదాశివయ్య, అధ్యాపకులు లత, సులేమాన్ అభినందించారు.

అడవిపందిని ఢీకొని ఇద్దరికి గాయాలు


మహమ్మదాబాద్: బైకుపై వెళ్తున్న ఇద్దరు యువకులకు పట్టపగలే అడవిపంది అడ్డు తగలడంతో బైకు కిందపడి గాయాలైన ఘటన మండలంలో చోటు చేసుకున్నది. 108 సిబ్బంది కథనం ప్రకారం.. కుల్కచర్ల మండలానికి చెందిన హనుమంతు, కేశవులు మంగళవారం ఉదయం 9:30 గంటలకు బైక్‌పై మహబూబ్‌నగర్ వెళ్తున్నారు. మండలంలోని గాధిర్యాల్ గేటు దాటి వెళ్తున్న సమయంలో రోడ్డు దాటుతున్న అడవిపందిని ఢీకొట్టారు. దీంతో హన్మంతు ఎడమకాలు విరిగిపోగా, కేశవులు ముఖానికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

జేఎంఎం నియోజకవర్గ అధ్యక్షుడిగా రాజు

మహబూబ్‌నగర్ రూరల్: జాతీయ మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడిగా బోయపల్లికి చెందిన రాజు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడి సూచన మేరకు రాజుకు జేఎంఎం రాష్ట్ర కో–ఆర్డినేటర్ వెంకటస్వామి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చిన్న, ప్రధాన కార్యదర్శి మహేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చారు

జడ్చర్ల: మండలంలోని కొండేడు నుంచి తొమ్మిదిరేకుల వరకు బీటీరోడ్డు ఎక్కడికక్కడ బీటీ తేలిపోయి గుంతలుపడి ప్రమాదకరంగా మారడంతో పెద్దఆదిరాలకు చెందిన పలువురు స్వచ్ఛందంగా ముందుకొచ్చి మట్టితో గుంతలను పూడ్చారు. రెండురోజులుగా రోడ్డుపై ఉన్న గుంతలను మట్టితో పూడ్చి రాకపోకలకు అనుకూలం చేశారు. ఇటీవల పలువురు రోడ్డుప్రమాదాలకు గురయ్యారని, ఇద్దరు మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. తామే ప్రభుత్వం కోసం ఎదురుచూడకుండా రోడ్డుపై మట్టిని పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో రామలింగారెడ్డి, మల్లికార్జున్, శివకుమార్, శ్రీను, రమేశ్, అంజి పాల్గొన్నారు.



ఇంకెన్నాళ్లీ నిరీక్షణ?



దేవరకద్ర పీఏసీఎస్ వద్ద టోకెన్ల కోసం బారులుదీరిన రైతులు



దేవరకద్రలో ప్రైవేటు దుకాణం ఎదుట మహిళా రైతుల క్యూలైన్

- యూరియా కోసం పడరానిపాట్లు
- తెల్లవారకముందే దుకాణాల ఎదుట రైతుల క్యూలైన్లు

దేవరకద్ర: రైతుకు గోస తప్పడం లేదు.. నిత్యం యూరియా కోసం పడి గాపులు పడుతున్నారు. తెల్లవారకముందే దేవరకద్రకు వచ్చిన రైతులు దుకాణాల ఎదుట క్యూలైన్లు కడుతున్నారు. యూరియా ఉన్నాలేకున్నా చెప్పేవారు లేకపోవడంతో అయోమయ స్థితిలో దుకాణాల ఎదుట బారులు తీరుతున్నారు. మంగళవారం ఉదయం 6గంటలకే రైతులు ప్రైవేట్ ఎరువుల షాపులు, పీఏసీఎస్‌ల వద్ద బారులుదీరారు. పెద్ద సంఖ్యలో వచ్చిన రైతులు ఆందోళన బాట పట్టకుండా వ్యవసాయ అధికారులు, పోలీసులు అక్కడికి చేరకుని టోకెన్లు జారీ చేస్తామని.. యూరియా వస్తే ఇస్తామని రైతులకు నచ్చజెప్పారు. ప్రైవేట్ డీలర్లకు వచ్చిన యూరియాను క్యూలైన్‌లో ఉన్న రైతులకు పంపిణీ చేశారు. ఇక పీఏసీఎస్ వద్ద ఉన్న రైతులందరికీ టోకెన్లను జారీ చేశారు. మహిళలకు ప్రత్యేక లైన్‌ను ఏర్పాటు చేసి టోకెన్లను పంపిణీ చేశారు. యూరియా వచ్చిన తర్వాత పంపిణీ చేస్తామని అధికారులు వెల్లడించారు. దీంతో రైతులు చాలా సేపు అధికారులతో వాగ్వాదానికి దిగారు. యూరియాను తెప్పించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఓ రాజేందర్ అగర్వాల్, ఎస్ఐ నాగన్న రైతులకు నచ్చజెప్పారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రైతులు రోడ్లపై తిరుగుతూ కనిపించారు. దేవరకద్రలో ఉన్న 17 ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎక్కడికి యూరియా వస్తుందా అని వేచి చూశారు.



దేవరకద్ర పీఏసీఎస్ వద్ద మహిళా రైతులు

వాట్సప్ మెసేజ్.. అరగంటలో వేయికి పైగా రైతులు



కాకర్లపహాడ్ రైతువేదిక వద్ద యూరియా కోసం బారులుదీరిన రైతులు

నవాబుపేట: మండలంలో యూరియా కోసం జనం ఎగబడుతున్న తరుణంలో అధికారులు ఆయా గ్రామాల్లో యూరియాను రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని కాకర్లపహాడ్ రైతువేదిక చెంత యూరియా అందుబాటులో ఉంచినట్లు మధ్యాహ్నం రెండున్నరకు మేసేజ్ చేస్తే కేవలం అరగంటలోపే వేయి మందికిపైగా రైతులు చేరుకుని క్యూకట్టారు. దీంతో అధికారులు కలెక్టర్ ఆదేశాలతో ఒక్కరికి ఒకే బస్తా పంపిణీ చేశారు. కేవలం 275 బస్తాలు మాత్రమే ఉండడంతో చాలామంది నిరాశతోనే వెనుదిరగాల్సి వచ్చింది.

తెలంగాణ ప్రజాకవి కాళోజీ

- కలెక్టర్ విజయేందిరబోయి
- కాళోజీ నారాయణరావుకు నివాళి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/జడ్చర్ల టౌన్/అడ్డాకుల/రాజాపూర్/మహబూబ్‌నగర మున్సిపాలిటీ/మహబూబ్‌నగర్‌క్రైం/మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/మహబూబ్‌నగర్ రూరల్/నవాబుపేట/మిడ్జిల్: తెలంగాణ యాస, భాషకు కాళోజీ నారాయణరావు పితామహుడని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. కాలేజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర భాషా దినోత్సవంలో భాగంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నరసింహారెడ్డి, హౌజింగ్‌పీడీ వైద్యం భాస్కర్, డీఆర్డీఓ నరసింహులు, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిర, కలెక్టరేట్ ఏఓ సువర్ణరాజ్, ఎల్‌డీఎం భాస్కర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి, అధికారులు

కాళోజీ ఆలోచనలు మార్గదర్శకం

కాళోజీ ఆలోచనలు సమాజానికి మార్గదర్శకమని ఎస్పీ జానకి అన్నారు. ఎస్పీ కార్యాలయంలో మంగళవారం కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రత్నం, సురేశ్‌కుమార్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, ఏవో రుక్మిణి, ఆర్ఐలు కృష్ణయ్య, నగేశ్, రవి పాల్గొన్నారు.

➡ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ ఆజ్మీరా రాజన్న, ఆర్ఓ మహమ్మద్‌ఖాజా తదితరులు పాల్గొన్నారు.

➡ పీయూలో కాళోజీ నారాయణ రావు జయంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ.. కాళోజీ తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారని, ఉద్యమంలో ప్రజలను చైతన్య వంతులుగా చేసేందుకు ఆయన కవిత్వం ఎంతగానో ఉపయుక్తంగా మారిందన్నారు. పదవుల కోసం కాకుండా సమాజం కోసం పాటుపడిన వ్యక్తి కాళోజీ అని కొనియాడారు.

కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, ఎస్ఎస్ఎస్‌సెల్ కోఆర్డినేటర్ ప్రవీణ, కుమారస్వామి, అనురాధారెడ్డి, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

➡ శ్రీచైతన్య స్కూల్‌లో ఏజీఎం భాస్కర్‌రెడ్డి కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

➡ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి తహసీల్దార్ ఘన్సీరామ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీటీలు దేవేందర్ కేసిరెడ్డి, సునీల్, ఆర్ఐలు సుదర్శన్‌రెడ్డి, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

➡ జడ్చర్ల డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగాధిపతి నర్సింహులు అధ్యక్షతన ప్రిన్సిపాల్ సుకన్య కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అకాడమిక్ కో ఆర్డినేటర్ రాఘవేంద్రరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

➡ కోడ్గల్ జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం శ్రీనివాసులు నేతృత్వంలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాళోజీ రచనలు, ప్రజాసేవను విద్యార్థులకు వివరించారు. తెలుగు పండితులు కృష్ణ, మల్లికార్జున్‌ను సన్మానించారు.

➡ అడ్డాకుల ఎమ్మార్సీలో ఎంఈఓ ప్రకాశ్ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, టీటీయూ జిల్లా అధ్యక్షుడు నారాయణ, పీఆర్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.



కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎస్పీ జానకి

➡ రాజాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో తాసీల్దార్ రాధాకృష్ణ కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీటీ భారతి, ఆర్ఐలు మంజుల, యాదయ్య, సిబ్బంది సత్యయ్య తదితరులు పాల్గొన్నారు.

➡ మిడ్జిల్ తహసీల్దార్ కార్యాలయం, కేజీబీవీ, జూనియర్ కళాశాలలో కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కాళోజీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, ప్రిన్సిపాల్ తిరుపతయ్య, ప్రత్యేకాధికారిణి కవిత, కరన్‌జీ, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

➡ నవాబుపేట ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి ఎంపీడీఓ జయరాం నాయక్, తహసీల్దార్ శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఏపీఓ జ్యోతి, గోపాల్‌రెడ్డి, ఏపీఎం సురేశ్, శ్రీను పాల్గొన్నారు.



మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి



మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న అధికారులు



జడ్చర్ల డిగ్రీ కళాశాలలో ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ సుకన్య

వైద్య శిబిరం విజయవంతం

మిడ్జిల్: మండలంలోని వస్పుల, బైరంపల్లిలో మంగళవారం మిడ్జిల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వారికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి ఉచితంగా మందులు సరఫరా చేశారు. అనంతరం ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యులు శశాంక్, చెన్నమ్మ, అయూబ్‌ఖాన్, ప్రసాద్, సునంద, దేవయ్య, సంపత్ పాల్గొన్నారు.

వేధింపులు ఆపాలి

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలో తెల్లవారుజామున 5గంటలకు హాజరు పేరుతో జవాన్లు వేధిస్తున్నారని, కొత్తగా వచ్చిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ నిబంధనల పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ కమిటీ అధ్యక్షురాలు ఇందిరమ్మ ఆరోపించారు. మంగళవారం జరిగిన యూనియన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. 10నిమిషాలు ఆలస్యమైతే విధులకు తీసుకోవటం లేదని, పార్కుల్లో పని చేసే మహిళలను దూరప్రాంతాల్లోని పార్కులకు పనులకు వెళ్లాలని, పెద్ద ఫోన్లు లేకుంటే తీసుకుని వాటిలో ఫొటోలు దింపి ఇన్‌చార్జిలకు పెట్టాలని వేధిస్తున్నట్లు ఆరోపించారు. కార్మికులపై వేధింపులు మానాలన్నారు. ఈ విషయమై సోమవారం కమిషనర్, చైర్‌పర్సన్‌ను కలసి రాతపూర్వకంగా విన్నవిస్తామన్నారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, ఉపాధ్యక్షురాలు అంజమ్మ, అనూష, స్వరూప, అలివేలు, చంద్రకళ, శ్యామల, యాదయ్య, రాజు, శంకర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

వ్యక్తికి రిమాండ్

జడ్చర్ల: మహిళపై దాడిచేసి నగదు లాక్కెళ్లిన వ్యక్తిని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. సీఐ కథనం మేరకు.. గౌరీశంకర్ కాలనీకి చెందిన అంచెన యాదమ్మ ఈనెల 6న నేతాజీ చౌరస్తాలో మొబైల్ కొనేందుకు వెళ్లగా.. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం ఇప్పలపల్లికి చెందిన నాగరాజు.. మహిళకు ఇంటి పనులు చూపిస్తానంటూ నమ్మబలికి తనవెంట గంగాపూర్ వైపు ముళ్లపొదలచాటుకు తీసుకెళ్లాడు. అక్కడ ఆమెపై దాడిచేసి పర్సు లాక్కొని పారిపోయాడు. పర్సులో రూ.5వేలు ఉన్నాయని, తనపై దాడి చేశాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సోమవారం నిందితుడిని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. రెండు పాతకేసుల్లో కూడా నిందితుడిగా ఉండడంతో రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

హరిజనవాడలో దుర్గంధ పరిస్థితులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాత పాలమూరులోని హరిజనవాడలో పరిస్థితులు దుర్గంధభరితంగా మారాయని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు అన్నారు. మంగళవారం కాలనీలో పార్టీ ఆధ్వర్యంలో సర్వే చేయగా.. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదని తేలిందన్నారు. వీధికుక్కలు, పందులు విపరీతంగా సంచరిస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎర్రకుంట నుంచి వచ్చే వరద నీరు, మురుగు పాత పాలమూరులోని మర్రిబాయి రోడ్డు వరకు చేరుకుంటోందన్నారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించకుంటే మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట ధర్నాకు దిగుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శివ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 13మందిని జిల్లా కేంద్రంలోని ఆర్వీఎం హాల్‌లో ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

గండేడ్: మండంలోని రంగారెడ్డిపల్లి హెచ్ఎం బాల్‌రాజ్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికవడంతో ఆయా ఉపాధ్యాయ సంఘాలు మంగళవారం శాలువా పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ జనార్దన్, పీఆర్టీయూ టీఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, టీఎస్ యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, మహిపాల్‌రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: నంచర్ల కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నారాయణ మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం సురేందర్‌రెడ్డి, వీరాజీ, అంజి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రూర్బన్ ఎకోపార్కును అభివృద్ధి చేయాలి

- అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

మహమ్మదాబాద్: రూర్బన్ నిధులతో ఏర్పాటు చేసిన ఎకో పార్కును అభివృద్ధి చేయాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ తెలిపారు. మంగళవారం మండలంలోని జూలపల్లి చింతగట్టు ఎకో పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్ని సంవత్సరాల క్రితం పనులు ప్రారంభించారు. ఇంకా ఏఏ పనులు పెండింగులో ఉన్నాయని తెలుసుకున్నారు. ముఖ్యంగా వాకింగ్ ట్రాక్, ప్రజలు కూర్చునేందుకు అక్కడక్కడా సిమెంటు కుర్చీలు, ఎంట్రీ గేట్, చింతగట్టు గుడిదగ్గరికి రోడ్డు సౌకర్యం ఏర్పాటు వంటి పనులు చేయాల్సి ఉన్నదని తెలిపారు. పార్కు అంతటా పిచ్చిమొక్కలను తొలగించి మంచి మొక్కలను నాటాలని సూచించారు. త్వరలో అన్నిపనులు ప్రారంభించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఫారెస్టు అధికారులు, కార్యదర్శిని ఆదేశించారు. ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండేందుకు పార్కులో అన్ని ర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, డిప్యూటీ రేంజర్ రాఘవేందర్, బీట్‌ఆఫీసర్ ఉదయ్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



జూలపల్లి ఎకో పార్కును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

చట్టాలు, హక్కులపై అవగాహన ఉండాలి

భూత్పూర్: రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కులపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఇందిర పేర్కొన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు చైల్డ్ ఫ్రెండ్లీ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. బాల్యవివాహాల నివారణ, బాలకార్మిక చట్టాలు వంటి అంశాలపై సూచనలు, సలహాలు చేశారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. ఉచిత న్యాయ సహాయంతోపాటు బాలలు, మహిళలకు ప్రాథమిక హక్కులను తెలియజేసేందుకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ పనిచేస్తుందన్నారు. బడిఈడు పిల్లలందరూ బడుల్లో ఉండాలని, బాలలు ఏదైనా సమస్య వస్తే 1098, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఫోన్ నంబరు 15100కు ఫోన్ చేస్తే అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపుతారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుగుణకుమార్, వైస్ ప్రిన్సిపాల్ రాధారాణి, పారా లీగల్ వలంటీర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ జడ్జి ఇందిర

అక్రమ కేసులకు భయపడం

దేవరకద్ర: దేవరకద్రలో కాంగ్రెస్ పాలన మూడు కేసులు ఆరు బెదిరింపులుగా సాగుతున్నది మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం సాయంత్రం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జెట్టి నర్సింహారెడ్డి బెయిల్‌పై విడుదలైన సందర్భంగా ఆయన నివాసంలో పరామర్శించిన మాట్లాడారు. పథకం ప్రకారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. అక్రమ కేసులు ఎదుర్కొడానికి సిద్ధంగాగా ఉన్నామని తెలిపారు. స్టేషన్ బెయిల్ ఇచ్చే అవకాశం ఉన్నా పార్టీ మారలేదనే కక్ష్యతో జెట్టి నర్సింహారెడ్డిపై నాన్ బెయిలబుల్ కేసు పెట్టి జైలుకు పంపించారని ఆరోపించారు. సీఎం సొంత జిల్లాలో పోలీసు రాజ్యం నడుస్తున్నదని.. అక్రమ కేసుల పరిణామాలకు ఎమ్మెల్యే మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్‌యాదవ్, భాస్కర్‌రెడ్డి, బాల్‌రాజు, నరేందర్‌రెడ్డి, కొండారెడ్డి, వెంకట్రాములు, ఆంజనేయులు, సత్యం తదితరులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

డిజిటల్ యాప్‌తో పంటకోత ప్రయోగాలపై శిక్షణ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పంటకోత ప్రయోగాల డిజిటల్ యాప్‌పై శిక్షణా తరగతులను మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్ఐసీ సమావేశ మందిరంలో సీపీఓ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీఎస్ఓ, ఏఈఓలు వారికి కేటాయించిన గ్రామాల్లో పొరపాటు లేకుండా పంటకోత ప్రయోగాలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సేకరించిన వివరాలను సమయానికి డీజీసీఈఎస్ యాప్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తున్నప్పుడు ప్రాథమిక కార్యకర్తలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు తెలియజేశారు. సేకరించిన వివరాలను సమయానికి డీజీసీఈఎస్ యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. పంటకోత ప్రయోగాలు కేవలం ఒక సర్వే కాకుండా, రైతులు, ప్రభుత్వానికి ఉపయోగకరమైన అంచనాలు వేయడానికి ఉపయోగపడతాయని, పంటల దిగుబడి అంచనా వేయడానికి, ప్రభుత్వం వ్యవసాయం, పంటలపై తగు విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి దోహదపడుతుందన్నారు. మార్కెట్ ధరలు, ఎగుమతులు, దిగుమతులు స్థిరంగా ఉండేలా చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వానికి ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ గణాంక అధికారులు నర్సింహులు, రాజేశ్, ఎంపీఎస్ఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ చేయని పనులు 20నెలల్లో చేశాం

భూత్పూర్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేయని పనులు 20నెలల్లో చేసి చూపించామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తాటిపర్తిలో అంగన్‌వాడీ భవనం, పెద్దతండా నుంచి లోక్యాతండా వరకు రూ.1.05 లక్షలతో చేపట్టే బీటీ రోడ్డుకు శంకుస్థాపనలు, ఎల్కిచర్లలో జీపీ భవనం ప్రారంభం, అంగన్‌వాడీ, హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణానికి భూమిపూజ, మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌లో నాబార్డ్, మైక్రో ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. తాటిపర్తి పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకట్ నర్సింహారెడ్డి, పట్టణశాఖ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భూపతిరెడ్డి తదితరులు ఉన్నారు.



పెద్దతండాలో బీటీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మధుసుదన్‌రెడ్డి

లింగంపేట పంచాయతీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

జడ్చర్ల టౌన్: మండలంలోని లింగంపేట జీపీ వద్ద మంగళవారం ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. మహిళా సంఘాల డబ్బులు బ్యాంక్‌లో చెల్లింపుల విషయంలో జరిగిన అవకతవకలపై మహిళలు పెద్దఎత్తున గుమిగూడారు. అదే సమయంలో గంగాపురం ఏపీజీవీబీ అధికారులు అక్కడికి చేరుకోవడంతో వారితోనూ వాగ్వాదానికి దిగారు. గ్రామంలో రెండు మహిళా సంఘాలున్నాయి. వీటికి సంబంధించి ఇద్దరు బుక్ కీపర్లుగా రమేశ్, రేష్మ పనిచేస్తున్నారు. జూన్‌లో మహిళా సంఘాల నుంచి రూ.12లక్షలకుపైగా వసూలు చేశారు. ఆ డబ్బును బ్యాంక్‌మిత్ర గౌస్ తీసుకువెళ్లి బ్యాంకులో కట్టాల్సి ఉండగా.. సకాలంలో జమ చేయలేదు. ఈ విషయం తెలిసిన తర్వాత అతడితో రికవరీ చేసి బ్యాంకులో డబ్బులను జమ చేశారు. ఆలస్యంగా చెల్లించినందుకు వడ్డీ చెల్లించాల్సి వచ్చింది. ఈ విషయం తెలిసిన మహిళా సంఘాల సభ్యులు తాము సకాలంలో డబ్బులు కట్టినా వడ్డీ ఎందుకు చెల్లించాలంటూ ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఉదయం జీపీ వద్దకు మహిళలు పెద్దఎత్తున జమయ్యారు. బుక్ కీపర్లు, మహిళా సంఘం బాధ్యులతో వాగ్వాదానికి దిగారు. అప్పుడే గంగాపురం బ్యాంకు మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్లు రాగా.. వారితోనూ వాగ్వాదానికి దిగారు. బ్యాంకు మిత్ర డబ్బులు జమచేయకుంటే ఎందుకు తమకు చెప్పలేదంటూ నిలదీశారు. తాము వడ్డీ చెల్లించలేమంటూ గొడవకు దిగారు. అనంతరం మరోసారి సమావేశమై అవకతవకలపై పూర్తిగా విచారణ చేయాలని నిర్ణయించడంతో మహిళలు అక్కడినుంచి వెళ్లిపోయారు. కాగా మొత్తం 20నుంచి 30లక్షల వరకు అవకతవకలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



ఉత్సాహంగా మండలస్థాయి క్రీడాపోటీలు

దేవరకద్ర: మండలంలోని కోయిల్‌సాగర్ జెడ్పీ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో రెండు రోజులుగా జరిగిన అండర్–14, 17 ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడలు మంగళవారం సాయంత్రం అట్టహాసంగా ముగిశాయి. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, రన్నింగ్‌లో బాలబాలికలు పాల్గొన్నారు. మండలంలోని 10 జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి గెలుపొందిన విజేతలను అభినందించి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ బలరాం, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు బుచ్చారెడ్డి, చంద్రశేఖర్, రఘువర్ధన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శంకర్, వేణుగోపాల్, వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు అంజిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గండేడ్: మండలంలోని వెన్నాచేడ్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ మండలస్థాయి ఖోఖో, వాలీబాల్ పోటీలను మంగళవారం నిర్వహించారు. ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. సాయంత్రం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రవిబాబు, ఆంజనేయులు, ఎస్సై శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచులు అనంతలక్ష్మారెడ్డి, గోపాల్, పీఈటీలు పాల్గొన్నారు.



కోయిల్‌సాగర్‌లో బహుమతి ప్రదానం చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు